ప్రజాశక్తి
శుక్రవారం 5 ఏప్రిల్ 2024
5
విజయనగరం

ఎన్నికల శిక్షణకు ర్యాండమైజేషన్

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల శిక్షణా కార్యక్రమంలో పాల్గొనే పిఒలు, ఎపిఒలకు ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలను కేటాయించారు కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టరేట్‌లోని ఎన్ఐసి కార్యాలయంలో, కంప్యూటర్ ద్వారా గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2,152 మంది ప్రిసైడింగ్ అధికారులు, మరో 2,152 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నియోజకవర్గాలను ఎంపిక చేశారు. వీరికి ఈనెల 13, 15తేదీల్లో శిక్షణా కార్యక్రమాన్ని ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు సుమారు 8,500 మంది అదనపు పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశారు. ఎంపికైన పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు ఈనెల 15లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం సంబంధిత తాహశీల్దార్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ అనిత, డిఐఒ నరేంద్ర, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ఫస్ట్

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- 1.18 లక్షల పనిదినాలు
- రూ.502.27 కోట్ల మేర చెల్లింపులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమల్లో విజయనగరం జిల్లా రాష్ట్రంలో మరోసారి మొదటి స్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం (2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ వరకు)లో జిల్లాలో 2.10లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 1.18లక్షల పనిదినాలు కల్పించారు. రాష్ట్రంలో అతి ఎక్కువ పనిదినాలు కల్పించినట్టుగా జిల్లా రికార్డుకెక్కింది. వామపక్షాల ఒత్తిడితో 2005లో అప్పటి యుపిఎ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని రూపొందించిన విషయం విధితమే. దీని అమలులో విజయనగరం జిల్లా ముందంజలో ఉంటోంది. జిల్లాలో వలసల నివారణకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ పథకం ఆలంబనగా నిలుస్తోంది. జిల్లాలో ప్రస్తుతం సుమారు 3,82,000 జాబ్‌కార్డులు ఉండగా, 3.21లక్షల కార్డులపై 5.04లక్షల కూలీలు పనిలోకి వెళ్తున్నారు. ఈ ఏడాది చేపట్టిన పనులకు సంబంధించి ఫిబ్రవరి 6 నాటికి జరిగిన పనులగాను రూ.502.27 కోట్ల మేర వేతన చెల్లింపులు జరిగాయి. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 31వ తేదీ వరకు కల్పించిన పని దినాలకు సంబంధించి మరో రూ.60లక్షల వరకు కూలీలకు అందాల్సివుంది. జాబ్ కార్డుదారుల్లో 8,076 మంది వికలాంగులు ఉన్నారు. వీరికి 4,45,400 పనిదినాలు కల్పించారు. ఇందులోనూ రాష్ట్రంలో మొదటి స్థానం లభించడం గమనార్హం. మొత్తం గిరిజన కార్డుదారుల్లో 83.661శాతం మందికి ఉపాధి పనులు దొరికాయి. 65,441 కార్డుదారులు 100రోజుల పనిదినాలు ఉపయోగించుకున్నారు. గత ఏడాది కూడా ఉపాధి కల్పన, ఎస్సీ, ఎస్టీల పనిదినాలు కల్పించడం వంటి అంశాల్లో విజయనగరం మొదటి స్థానంలో నిలిచింది. అంతకు ముందు జాతీయ అవార్డులు సైతం వచ్చాయి.

ఇందుకు కారణం లేకపోలేదు. విజయనగరం పూర్తిగా వ్యవసాయాధారమైన జిల్లా. సారవంతమైన భూములు ఉన్నప్పటికీ పాలకులు సాగునీటి వనరులు కల్పించలేదు. పారిశ్రామికాభివృద్ధి లేదు. దీంతో, ఏటేటా వలసలు పెరుగుతుండేవి. ఈ పథకం అమల్లోకి వచ్చాక క్రమంగా తగ్గాయి. జ్యూట్ మిల్లులు మూత, ఒడిదొడుకుల మధ్య నడుస్తున్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల్లో ఉపాధి కోల్పోతున్నవారికి కూడా ఉపాధి పనులే జీవనాధారంగా ఉన్నాయి.

సమిష్టి కృషితో మొదటి స్థానం

పనిదినాల కల్పనలో దేశంలోనే మన జిల్లా మొదటి స్థానం సాధించడం పట్ల చాలా ఆనందంగా ఉంది. సమిష్టి కృషితోనే జిల్లా మొదటి ర్యాంకులో నిలిచింది. ఇందుకు డ్వామా సిబ్బందికి, వేతనదారులు కూడా అభినందనలు. జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశం, సిబ్బంది కృషి ముఖ్య కారణం. ఉపాధి పనులపట్ల వేతనదారుల్లో ఉన్న నమ్మకం కూడా దీనికి కారణంగా భావిస్తున్నాం. ఇదే స్ఫూర్తితో మరిన్ని లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తాం.

- ఉమా పరమేశ్వరి,
డ్వామా పీడీ, విజయనగరం

కోర్టు తీర్పు అనంతరం మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఉపాధ్యాయ సంఘాల నాయకులపై కేసు కొట్టివేత

2017లో కలెక్టరేట్ ముట్టడి
15 మందిపై కేసు నమోదు
ఏడేళ్ల అనంతరం కోర్టు తీర్పు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

టీచర్ల బదిలీల కౌన్సిలింగ్ విధానంలో లోపాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ 2017 జూన్ 21న జిల్లా కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక (ఫ్యాప్టో) ఆధ్వర్యాన జరిగిన పోరాటం సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన కేసును ఎట్టకేలకు కోర్టు కొట్టివేసింది. ఆనాడు మాన్యువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించాలని, బదిలీల్లో అశాస్త్రీయమైన పాయింట్ల విధానాన్ని తొలగించాలని తదితర డిమాండ్లపై వేలాది మంది విద్యార్థులు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. అప్పట్లో ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో పోలీసులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు 15 మందిపై కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయ నాయకుల తరుపున ఈ కేసును ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు, న్యాయవాది గేదెల సత్యం వాదించారు. సుమారు ఏడేళ్లు పాటు సుదీర్ఘకాలం కేసు విచారణ సాగింది. 18 సాక్షులను న్యాయమూర్తి విచారించిన అనంతరం ఎట్టకేలకు ఈ కేసును కొట్టివేస్తూ సీనియర్ సివిల్ జడ్జి గురువారం తీర్పు చెప్పారు. అప్పట్లో కేసు నమోదైన నాయకుల్లో కె.శేషగిరి, కె.విజయగౌరి, ఎస్.మురళీ మోహన్‌రావు, కె.శ్రీనివాసరావు, కె.గోపాల్ పట్నాయిక్, డి.ఈశ్వరరావు, బి.జోగినాయుడు, జెసి రాజు, ఎ.సదా శివరావు, కె.జోగారావు, ఎ.గౌరీశంకర గణపతిరావు, జె.రామునాయుడు, బి.గోవిందనాయుడు, టి.సన్యాసిరాజు, షేక్ బుకారిబాబు ఉన్నారు. వీరిలో శేషగిరి 2021లో కరోనాతో మరణించిన విషయం తెలిసిందే.

ఇది ఉపాధ్యాయుల విజయం

కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులపై పోలీసులు పెట్టిన కేసును కొట్టివేయడం ఉపాధ్యాయుల విజయమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎస్.మురళీ మోహనరావు తెలిపారు. కేసులో ఉపాధ్యాయ ఉద్యమమే విజయం సాధించిందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా సాగిన ఈ కేసులో సమయం, సెలవులు అన్నింటినీ నాయకత్వం ఎదుర్కొందని తెలిపారు. కేసులకు,జైళ్లకు భయపడే పరిస్థితి లేదన్నారు. పోరాటాలు ఎప్పుడూ విజయం సాధిస్తాయని అన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి కార్తీక్

ఓటుహక్కును వినియోగించుకోవాలి

అవగాహన ర్యాలీలో జాయిర్ కలెక్టర్ కె.కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతి తీఒక్కరూ తమ అమూల్యమైన ఓటుహక్కును వినియోగించు కోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. ఓటుహక్కు వినియోగం పట్ల ప్రజల్లో చైతన్యం పెంచి, శతశాతం ఓటింగ్ నమోదు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా భారీ వాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద ఆయన గురువారం ప్రారంభించారు. ఈ ర్యాలీలో 50 మున్సిపల్ వాహనాలు, 20ఎండియు వాహనాలు పాల్గొన్నాయి. వాహనాలకు బ్యానర్లును కట్టి, మైకులద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, కోట, మూడులాంతర్లు, గంటస్తంభం మీదుగా ఎన్‌సిఎస్ వరకు జరిగింది.ర్యాలీని ప్రారంభించిన అనంతరం జెసి కార్తీక్ మాట్లాడుతూ, ఓటర్లలో అవగాహన పెంచేందుకు స్వీప్ కార్యక్రమాన్ని గత రెండు వారాలుగా విస్తతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. త్వరలో మహిళల కోసం ప్రత్యేకంగా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో అన్ని వర్గాలకూ భాగస్వాములను చేసి, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కషి చేస్తున్నామని జెసి తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డిఎస్ఒ మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, తాహశీల్దార్ పివి రత్నం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : కళా

ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో రాక్షస, దుష్ట, నియంతృత్వ పాలన సాగిందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. గురువారం చీపురుపల్లి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నియంతృత్వ పోకడలు, బలవంతంగా ఏదనుకుంటే అది చేసేసి ప్రజాస్వామ్యాన్ని మంట గలిపి దుష్ట పాలన సాగించారని విమర్శించారు. యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని అన్నారు. ఒక్క నోటిఫికేషన్ గానీ, ఒక్క ఉద్యోగం గాని ఇచ్చిన పాపాన పోలేదన్నారు. 20 లక్షల మంది ఇంజనీర్లను తయారు చేశాడే తప్ప ఒక్క ఉద్యోగం కూడా యువతకు ఇవ్వలేదన్నారు. ఒక ఫ్యాక్టరీ గానీ, సర్వీస్ సెంటర్స్ గానీ రాష్టానికి తీసుకు రాలేదని అన్నారు. అంతే గాకుండా ఇసుక, మైనింగ్, మద్యంలో భారీ దోపిడికి పాల్పడ్డారని తెలిపారు. ఇసుక నిల్వలు పక్క రాష్ట్రాలకు అమేసుకోవడం వలన రాష్ట్రంలో ఇసుక దొరకని పరిస్థితి నెలకొందన్నారు. దీనివల్ల రాష్ట్రంలో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. భవిష్యత్ తరాలకోసం, రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పన కోసం, రాష్ట్ర అభివృద్ధిలో గాని ముందుకు సాగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అన్నారు.

నాగార్జునను మాతో పాటు నడిపిస్తాం

పరిస్థితుల రీత్యా తనను చీపురుపల్లి నుండి పోటీ చేయాలని అదిష్టానం నిర్ణయించిందని కిమిడి కళావెంకటరావు అన్నారు. గత ఐదేళ్లలో చీపురుపల్లి ప్రజలలో ఉంటూ వారి కష్ట సుఖాలలో ఉన్న నాగార్జునను అదిష్టానం పిలిచి భవిష్యత్‌పై మాట్లాడిందని అన్నారు. గతంలో నాగార్జున తల్లిదండ్రులను తమతో ఏవిధంగా అయితే కలిసి నడిపించామో అదే విధంగా భవిష్యత్‌లో కూడా మా ఇంటి బిడ్డ అయిన నాగార్జునను తమతోపాటే తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండల పార్టీ అధ్యక్షులు సారిపాక సురేష్, తాడ్డి సన్యాసినాయుడు, వెన్ని సన్యాసినాయుడు, పైల బలరాం, దన్నాన రామంద్రుడు, రెడ్డి గోవిందబాబు, జనసేన మండల అధ్యక్షుడు విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీపురుపల్లినుంచి ప్రచారం ప్రారంభం

కళావెంకటరావు తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులతో కలిసి చీపురుపల్లిలో ప్రచారం ప్రారంభించారు. ముందుగా కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయంలో తన కుమారుడు మల్లిక్‌నాయుడుతో పాటు నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రౌతుకామునాయుడు, దన్నాన రామంచంద్రుడు, కె త్రిమూర్తులు రాజు, గద్దే బాబూరావు, అందవరపు హరి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేసారు. అనంతరం గద్దే బాబూరావు ఇంటి వద్ద యలకల అప్పారావు, గరివిడి మాజీ ఎంపిటిసి రవి, బిజెపి

ప్రచారసభలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

కేసు వేసి పింఛన్లు ఆపడం తప్పు కాదా?

ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స

ప్రజాశక్తి-మెరకముడిదాం

ప్రతినెలా ఇంటింటికీ వెళ్లి వాలంటీర్లు పెన్షన్ లు అందిస్తే టిడిపి నాయకులు పిటిషన్ పెట్టి ఆపడం తప్పు కాదా. చంద్రబాబునాయుడికి అవ్వ తాతలు, వికలాంగులు ఉసురు తగలాదా? అని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని చిన రవ్వాం గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇప్పించాలని బొత్సను కోరగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఏమీ చేయలేమని, ఒక ఆరు మాసలు ఆగితే మళ్లీ వైసిపిప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే మీ గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, మిగిలిన ఈ తాగు నీటి సమస్య కూడా పరిష్కరిస్తామని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికలలో ఎంఎల్ఎగా తనకు,ఎంపిగా బెల్లానచంద్రశేఖర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్,జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డాక్టర్ బొత్స సందీప్, మండల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

అభివృద్ధి చేసేవారిని గెలిపించండి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని 49వ డివిజన్ గాజులరేగపరిధిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. స్థానికులు, వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ మాట్లాడుతూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న వ్యక్తులనే గెలిపించాలని తద్వారా నియోజకవర్గం మరింత అభివృద్ధి దిశగా పయనించేందుకు అవకాశం ఉంటుందని ఓటర్లను అభ్యర్థించారు. ఓవైపు అభివృద్ధి మరోవైపు నగర సుందరీకరణతో నగరం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పయనించిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మన్యాల కృష్ణ, 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు కణుగుల రాజా, వైసిపి నగర ప్రధాన కార్యదర్శి జామాన శ్రీనివాసరావు, జమ్ము మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలనలో అదితి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం నియోజకవర్గం క్లస్టర్ 3 , 4 పరిధిలో గల వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్ అభ్యర్థులు, యూనిట్ ఇంచార్జ్, బూత్ ఇంచార్జిలతో టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు వెరిఫికేషన్, కుటుంబ సాధికార సారధుల నియామకం పూర్తి చేయడం, 85 ఏళ్లు దాటిన ఓటర్లను గుర్తించి వివరాలు సేకరించడం, డబుల్ ఎంట్రీ ఓటర్లు గుర్తించడం , 18 - 24 సంవత్సరాల వయసు గల కొత్త ఓటర్లను గుర్తించి సదరు వివరాలు త్వరగా పార్టీ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. సమావేశంలో నగర పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు , 3, 4 క్లస్టర్ ఇంఛార్జులు పాల్గొన్నారు.

గడిగెడ్డపై తీవ్ర నిర్లక్ష్యం

చప్టాపై అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు

- మధ్యలో నిలిచిన కాలువ లైనింగ్ పనులు
- శివారు భూములకు అందని నీరు
- ఏళ్ల తరబడి సాగునీటి కోసం ఎదురు చూపు
- నాడు టిడిపి.. నేడు వైసిపి నిర్లక్ష్యం
- కాలువ గట్టును తవ్వేస్తున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి-గుర్ల

ప్రభుత్వాలు మారినా రైతుల బాధలు మాత్రం తీరడం లేదు. రైతే దేశానికి వెన్నెముక అని ఊదరగొడుతున్న పాలకులు రైతుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడినా వ్యవసాయ భూములకు సాగునీరు అందించిన దుస్థితి నెలకొంది.

గుర్ల మండలానికి సంభందించి ఏకైక సాగునీటి ప్రాజెక్టు గడిగెడ్డను 1965లో నిర్మించారు. అప్పటి గజపతినగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జి. సూర్యనారాయణ, పెనుమత్స సాంబశివ రాజు పట్టుదలతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కుడి ఎడమ కాలువల నుండి 2900 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కుడి కాలువ ద్వారా పకీరుకిత్తలి, బూర్లిపేట, పల్లిగండ్రేడు, గరికివలస, గజపతినగరం మండలం కెంగువ గ్రామానికి సాగు నీరు అందిస్తుంది. ఎడమ కాలువ ద్వారా తెట్టంగి, గూడెం, పాలవలస, పున్నపురెడ్డి పేట, గోషాడ, కలవచర్ల గ్రామాలకు సాగునీరు అందించడానికి ఏర్పాట్లు చేశారు. కానీ ఎన్ని ప్రభుత్వాలు మారిన గోషాడ, కలవచర్లగ్రామలకు గడిగెడ్డ నీరు అందని ద్రాక్షలానే ఉంది. లైనింగ్ పనులు పూర్తి కాకపోవడంతో కుడి కాలువ పరిధిలో కెంగువ, గరికివలస, ఎడమ కాలువకు సంబంధించి గూడెం, పున్నపురెడ్డి, పాలవలస భూములకు నీరందడం లేదు.

2009 ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి బొత్స సత్య నారాయణ గడిగెడ్డ కాలువల అభివృద్ధి, సిమెంట్ లైనింగ్ పనులకు రూ.16 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కుడు,ఎడమ కాలువలకు సగం వరకు పనులు చేసి వదిలేశారు. దీంతో ఆయకట్టు శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందడం లేదు. కుడి, ఎడమ కాలువ కింద రైతులు కాలువ గట్టును జెసిబిల సాయంతో తవ్వేస్తున్నా అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. విషయం తెలిసిన గ్రామ స్థాయి మండల స్థాయి నాయకులు కిమ్మనడం లేదు. ఎవరినైనా గట్టిగా అడిగితే వారికి ఓట్లు రవేమో అని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. 2014 నుండి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి కిమిడి మృణాళిని తోటపల్లి ప్రాజెక్ట్ నుండి గడిగెడ్డకు సాగునీరు అందించే కృషి చేసారు. 2016 నుండి 2018 వరకు తోటపల్లి నీరు వచ్చింది. గడిగెడ్డ అభివృద్ధి పనుల్లో భాగంగా సర్ప్లస్ చప్టా పై నుంచి రహదారి సౌకర్యం కల్పించాలని పరిసర గ్రామస్తులు కోరడంతో తేలిక పాటి వాహనాలు వెళ్లేందుకు, గడిగెడ్డ నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు అప్పటి మంత్రి కిమిడి మృణాళిని రూ.13 కోట్లు నిధులు కేటాయించారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. పనులు జరుగుతున్న సమయంలో 2019 సాధారణ ఎన్నికలు వచ్చాయి.

ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ చేపట్టింది. ఇందులో భాగంగా గడిగెడ్డ అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి. గతంలో టిడిపి ప్రభుత్వం, నేడు వైసిపి ప్రభుత్వం రెండూ గడిగెడ్డ అభివృద్ధిపై సవతి తల్లి ప్రేమ చూపాయని రైతులు వాపోతున్నారు.

గడిగెడ్డ కాలువను జెసిబితో తవ్వేసి సాగు చేస్తున్న రైతులు

రేపు పవన్‌కల్యాణ్ బహిరంగ సభ

ప్రజాశక్తి- బొబ్బిలి

నెల్లిమర్ల మండల కేంద్రంలోని రామతీర్థం కూడలిలో ఈ నెల 6న శనివారం సాయంత్రం 4గంటలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి తెలిపారు. బుధవారం జరగాల్సిన సభ పవన్ కళ్యాణ్ అనారోగ్యం కారణంగా వాయిదా పడిందన్నారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలను కోరారు.

పవన్ సభను జయప్రదం చేయండి

శృంగవరపుకోట: పవన్ కళ్యాణ్ సభను జయప్రదం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి గెలుపే లక్ష్యంగా ఈ నెల 6వ తేది శనివారం సాయంత్రం 4 గంటలకు నెల్లిమర్ల రామతీర్థాలు జంక్షన్‌లో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని చెప్పారు. ఈ సభను ఎస్.కోట, వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి మండలాల టిడిపి, జనసేన, బిజెపి పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు.

నేడు జగ్జీవన్ రాం జయంతి

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర మాజీ మంత్రి బాబూ జగ్జీవన్ రాం 117వ జయంతి ఉత్సవాలు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

వైసిపి పతనం ప్రారంభం : బేబినాయన

ప్రజాశక్తి- బాడంగి

వైసిపి ప్రభుత్వం పతనం ప్రారంభమైందని టిడిపి కూటమి విజయం తథ్యమని బొబ్బిలి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ఆధ్వర్యంలో కోడూరు గ్రామానికి చెందిన 150 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరాయి. జగన్ నిరంకుశ పాలనపై పేద, మధ్యతరగతి ప్రజల్లో తీవ్రవ్యతిరేకత ఉందని అందుకే చాలా మంది టిడిపిలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో జిల్లా బీసీ సాధికారిక కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, ఎంపిటిసి శ్రీదేవి, మరిపి రమేష్‌తో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి మాజీ సర్పంచ్

నెల్లిమర్ల: టిడిపిలోకి టెక్కలి మాజీ సర్పంచ్ నేతేటి అప్పలనాయుడుతో సహ 25 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. గురువారం స్థానిక నగర పంచాయతీ పరిధిలో గేదెల రాజారావు స్థలం వద్ద టిడిపి నియోజక వర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిని వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ టికెట్ రాలేదని అధైర్య పడవద్దని వైసిపి ఓటమి లక్ష్యంగా ఉమ్మడి అభ్యర్థి మాధవిని ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. అధిష్టానం తనకు భరోసా ఇచ్చి నీలాంటి నాయకున్ని పార్టీ వదులుకొదని అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని చెప్పారని తెలిపారు. నియోజక వర్గంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పని చేసి టిడిపి, జనసేన బలపర్చిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ పెల్లకురి శ్రీనివాసరెడ్డి, విజయనగరం ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, నాయకులు గేదెల రాజారావు, పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాద్ రావు, కలిదిండి పాణిరాజు, లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాజీ సర్పంచ్ నేతేటిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కర్రోతు

బాడంగి: మాట్లాడుతున్న బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా

టిడిపిలోకి దత్తి సర్పంచ్

దత్తిరాజేరు: టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం దత్తి గ్రామానికి చెందిన సర్పంచ్ తలారి వరహాలమ్మ, ఉప సర్పంచ్ సారిక బాబాజీ నాయుడు, మాజీ సర్పంచ్ బోడసింగి హేమలత, మాజీ ఎంపిటిసి బోడసింగి సింహాచలం, బోడసింగి సత్తిబాబు, తలారి రామస్వామి మాస్టారుతో పాటు 200 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన సాగాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపిపి పెద్దింటి మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జి బెజవాడ బంగారునాయుడు, ఎంపిటిసి వంగపండు కృష్ణమూర్తి నాయుడు, మజ్జి మహేష్, జనసేన నాయకులు, ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా దేవి

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ (2024-25) అధ్యక్షులుగా డి.వి.ఎల్. దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన న్యాయవాదుల సమావేశంలో సీనియర్ న్యాయవాది దేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బార్ అసోసియేషన్ తెలిపింది. గత కొద్ది రోజులుగా సీనియర్ న్యాయవాదుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దేవికి ఎక్కువ మంది న్యాయవాదులు మద్దతు రావడంతో ఏకగ్రీవం చేశారు. వైస్ ప్రెసిడెంట్‌గా కె. అచ్చిబాబు, కార్యదర్శిగా డి.శ్రీనివాస్, ఉప కార్యదర్శిగా గవర కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బోజంకి సన్యాసిరావు, మల్ల రాము, జి.వి.లత, కృష్ణంనాయుడు, సిహెచ్.సతీశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నిక పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆదేశించారు. గురువారం పాత బొబ్బిలి సచివాలయ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ, కాలువల నిర్వహణ, పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ పనుల్లో పూర్తిగా విఫలమయ్యారని గత వార్డు పర్యటనలో తెలియజేసిన పారిశుధ్య పనులు ఏవీ సక్రమంగా చేయలేదని వారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాలు పాటించకుండా సిబ్బంది విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పక ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఆమె వెంట ఇంఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కెవిఎస్ సత్యనారాయణ, పర్యావరణ ఇంజనీరు యు. సోమేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు ఎమినిటీ సెక్రటరీలు తదితరులు ఉన్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని ఇద్దరు వికలాంగులకు అభిమాని ఫౌండేషన్ సభ్యులు ట్రై సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమాని ఫౌండేషన్ అధ్యక్షులు రెడ్డి రాజగోపాల్ మాట్లాడుతూ వికలాంగులకు, పేదలకు సహాయం చేసేందుకు అభిమాని ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, పేదలకు నిత్యాన్నదానం చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ పేదలకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అభిమాని సభ్యులు పి.కాశీరామ్, శ్రీనివాస్, మన్మధ పాల్గొన్నారు.

తేజ వర్మకి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సిఎస్ఇ విభాగం విద్యార్థి గాదిరాజు తేజవర్మ చేసిన పరిశోధన, ట్రాన్స్‌ఫర్ లెర్నింగ్‌ని ఉపయోగించి మెరుగైన రొయ్యల గుర్తింపు, వ్యాధి వర్గీకరణ అనే అంశానికి గాను పిహెచ్‌డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అభినందించారు. డాక్టర్ ఎ.శ్రీకృష్ణ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. దీనికి డాక్టర్ ఎం.మురళీ సహ పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

పాఠశాల పరిశీలన

వేపాడ: వీలుపరితి పంచాయతీ పరిధిలో గల వెల్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు గురువారం సందర్శించి పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, మెనూ రికార్డులు, డైరీ, పాఠశాల ఆవరణ పరిశీలన చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులను ఎండలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు ఉన్నారు.

12 మంది వాలంటీర్లు రాజీనామా

బొబ్బిలి: మున్సిపాలిటీలోని 16వ సచివాలయంలో పని చేస్తున్న 12మంది వాలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను సచివాలయ అడ్మిన్‌కు అందజేశారు. పెన్షన్లు పంపిణీకు టిడిపి ఆటంకం కలిగించడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు సమాధానం చెప్పలేకపోతున్నామని అందుకే రాజీనామా చేసి వైసిపి గెలుపునకు పని చేస్తామని రాజీనామా చేసిన వాలంటీర్లు వేణు, సయ్యద్ షేక్ మహమ్మద్, లీలాగౌరి చెప్పారు.

జంతు సంక్షేమ చట్టాలపై శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జంతు హింస, జంతు రవాణా చట్టాల పై శిక్షణ శిబిరం ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక రామతీర్థ జంక్షన్ ఎస్‌సి కాలనీలో తన ఇంటి వద్ద శిక్షణ కార్య క్రమానికి సంబందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోగిశ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించడానికి ఈ నెల 7న విజయనగరం కలెక్టరేట్ వద్ద ఉన్న యూత్ హాస్టల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యకులు చోళ్ళ రాజకుమారి, నడిపేన సత్యవతి, గార పవన్ కుమార్, సిమ్మల శంకర్ రావు, తొంపల పైడితల్లి, గుర్రపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చనుమల్లకి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డిసిసిబి వైస్ ఛైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు చనుమల్ల వెంకట రమణను గురువారం పలువురు పరామర్శించారు. చనమల్ల రమణ కాలికి గాయం అవ్వడంతో ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆయన్ను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చిన్న కుమారుడు ప్రదీప్ నాయుడు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ జానా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా సతీష్, కౌన్సిలర్స్ మైపాడ ప్రసాద్, మొయిద శ్రీను, పాండ్రంకి సత్యనారాయణ, పైల మురళి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకొని వ్యక్తి మృతి

రామభద్రపురం: తారాపురం గ్రామానికి చెందిన బెవర సత్యనారాయణ (40) చెట్టుకు ఉరివేసుకొని బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతుడు గత కొన్నేళ్లగా మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలు మరచి మద్యం మత్తులోనే నిత్యం ఉండేవాడు. దీంతో భార్య, పిల్లలు మద్యం తాగకుండా ఉండాలని ఒత్తిడి చేస్తూ, మందలించడంతో అప్పుడు కూడా ఇలానే పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్యం కుదుట పడ్డ తరువాత మరలా మద్యానికి బానిసై అదే ధ్యాసతో నిత్యం ఉండటంతో మరలా భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన సత్యనారాయణ బుధవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తా అని చెప్పి జాతీయ రహదారి పక్కన టీకా లచ్చన్న గుడి వద్ద ఉన్న చెట్టు కొమ్మకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృత్యువాత

రేగిడి: మండలంలోని ఒప్పంగి గ్రామానికి చెందిన సాకేటి గణనాథ (47) ఈనెల 30న పాము కాటుకు గురైన విషయం తెలిసిందే. గణనాథ రాజాం కేర్ హాస్పిటల్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. గణనాథకు భార్య పార్వతితోపాటు గిరిజ, రాజేంద్రప్రసాద్ ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ యజమాని పాముకాటుతో మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని సర్పంచ్ గంటా మంగమ్మ, మోహనరావు, ఎంపిటిసి గంటా శకుంతలమ్మ కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వంగర: అక్రమంగా తరలిస్తున్న 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వైవి జనార్దన్ గురువారం తెలిపారు. మండలంలోని మద్దువలస సెంటర్ వద్ద పట్టుకుని సదరు వ్యక్తి ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నెల్లిమర్ల: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసుల తెలిపారు. నెల్లిమర్ల - విజయనగరం రైల్వే స్టేషన్ మధ్యన నెంబర్ 817,17/19 కరెంటు స్తంభాల మధ్య రైలు పట్టాలపై సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని మగ మనిషి చనిపోయి పడి ఉన్నట్లు పలాస రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహం పై కాఫీ రంగు కలిగిన లోవరు, సిమెంట్ కలర్ షర్టుపై వైట్ పువ్వులతో ఉన్న బట్టలు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే శ్రీకాకుళం రైల్వే ఎస్ఐ ఎస్. మధుసూదన్‌రావు, హెచ్‌సి నెంబర్ 9110305494 సంప్రదించాలని కోరారు.

నీటిని పొదుపు చేయాలి

ప్రజాశక్తి - గంట్యాడ

వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేయాలని జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీరు బి. ఉమాశంకర్ అన్నారు. జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో నీటి పొదుపుపై నరవ జ్యోతిరావు పూలే పాఠశాలలోని, గంట్యాడ కెజిబివి పాఠశాలలోని విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా జీవరాశులకు జలాన్ని అత్యంత పొదుపుగా వాడాలని, భూగర్భ జలాలు పెంపొందేందుకు సహకరించాలని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తీయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ డిపిఎం ప్రతినిధులు రామప, లక్ష్మణ, విజయ, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కెజిబివి ప్రిన్సిపాల్ అల్లి, జ్యోతిరావు పూలే పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణమ్మ, స్వచ్ఛభారత కన్సల్టెంట్లు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కోనాడలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, జిల్లా వైసిపి కోశాధికారి కందుల రఘుబాబు కోరారు. గురువారం మండలంలోని కోనాడ, బొడ్డుగురయ్యపేట గ్రామాల్లో తొమ్మిదో రోజు వైసిపి ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలంటే ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బెల్లానను గెలిపించుకోవాలని కోరారు. ప్రచారంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, రామతీర్థం ఆలయం బోర్డు సభ్యులు దాడిశెట్టి త్రినాదరావు, మాజీ సర్పంచి దాడిశెట్టి గోవిందరావు, ఎంపిటిసి అప్పలనర్సమ్మ, లక్ష్మణరెడ్డి, బొడ్డు యల్లాజీ, నాయకులు మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, దేశెట్టి గణేష్, పట్టెపు శ్రీనివాసరావు, యడ్ల రామకృష్ణ, రౌతు శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

వైసిపిని ఓడించడమే లక్ష్యం : మాధవి

ప్రజాశక్తి - భోగాపురం

వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యమని కూటమి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. భోగాపురంలోని పార్టీ కార్యాలయం వద్ద గురువారం సాయ ంత్రం పలువురు వైసిపిని వీడి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆమె మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేను ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

మాజీ జెడ్‌పిటిసి, పలువురు సర్పంచులు చేరిక

ఈ కార్యక్రమంలో లోకం మాధవి ఆధ్వర్యంలో డెంకాడ మాజీ జెడ్పి టిసి కంది సూర్యనారాయణ, అక్కివరం సర్పంచ్ కంది కిరణ్, పూసపాటిరేగ మండలం కొప్పర్ల సర్పంచ్ సంకా బత్తుల సత్తిబాబు, గోవిందపురం సర్పంచ్ బాల రామలక్ష్మి, ఉప సర్పంచ్ బాల అప్పలరాజు, పూసపాటిరేగ వైసిపి యూత్ లీడర్ మహంతి శివ, భోగాపురం వార్డు మెంబర్ గుండపు నానాజీ, నాయకులు బాలిపల్లి సత్తిబాబుతో పాటు పలువురు చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, తుమ్మి లక్ష్మీరాజ్ పతివాడ శ్రీనివాసరావు, జె.శివ, న్యాయవాది సుధాకర్, ప్రమీల, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండలంలోని లంకలపల్లి పాలెం గ్రామ పంచాయతీ నుండి వైసిపికి చెందిన పలువురు గురువారం జనసేన అభ్యర్థి లోకం మాదవి ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై నమ్మకంతో జనసేనలో అనేకమంది చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, బూర్లె విజయశంకర్‌తోపాటు పార్టీలో చేరిన రౌతు ఉపేంద్ర, నూకరాజు, గుడ్డాల రమణ, గుడ్డాల ఆదినారాయణ, గుడ్డాల రమేష్, రౌతు రమణ, తదితరులున్నారు.

భోగాపురం: పార్టీలో కలిసిన వారితో లోకం మాధవి

ఎన్నికల ప్రచారానికి గొంప సన్నద్ధం

ప్రజాశక్తి - జామి

ఎస్‌కోట నియోజకవర్గం టిడిపి టిక్కెట్ ఆశించి భంగపడిన గొంప కృష్ణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతున్న నేపథ్యంలో నేటి నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జామి గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యల్లారమ్మ తల్లి ఆలయాన్ని సతీసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం గొంప కృష్ణ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ప్రచారం మొదలు పెడుతున్నామన్నారు. మొదటిగా వేపాడ మండలంలోని సంజీవమెట్ట, వావిలాపాడు, చామలాదేవి అగ్రహారం, నల్లబల్లి, బోజంకివానిపాళెం, చిన్నగుడిపాల, గ్రామాల్లో ప్రచారం మొదలు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో లగుడు రవి కుమార్, గొరపల్లి రాము, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి పైడిబాబు, గుమ్మడి భారతి, ఇప్పాక త్రివేణి, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొంప కృష్ణ దంపతులు

వేపాడ: యువ నాయకులు గొంప కృష్ణ శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారని మండల నాయకులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు సంజీవ్ మెట్ట, వావిలపాడు, చామలాదేవి అగ్రహారం, నల్లబెల్లి, బోజంకి వానిపాలెం, చినగుడిపాల గ్రామాలలో ఈ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని కోరారు.

అప్పల ఆంధ్రాగా మార్చేశారు : కోళ్ల

ప్రజాశక్తి - జామి

జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశాడని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం జామి మేజరు పంచాయతీ, అప్పన్నదొర పాలెం, బ్రాహ్మణ వీధి, యాత పేటలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడూతూ ఈ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం కుంటిప డిందని, టిడిపి హయాంలో పంచాయతీ బిల్డింగ్స్, సిసి రోడ్లు, తారు రోడ్లు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, చంద్రన్న భీమా, పసుపు కుంకుమ, అన్న క్యాంటిన్, పెళ్లికానుక, ఆదరణ పథకం, బీసీలకి సబ్సిడీ లోన్స్, కళ్ళుగీత డప్పు కళాకారులకు పెన్షన్స్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు చేశామని గుర్తు చేశారు. ఈ నియోజక వర్గాన్ని ఎమ్మెల్యే కడుబండి ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. అనంతరం టిడిపి సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జామి మండల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు గురించి చెబుతున్న కోళ్ల

పింఛన్ల కోసం క్యూ

ప్రజాశక్తి- బొబ్బిలి

పింఛన్లు కోసం సచివాలయాలు వద్ద వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు క్యూ కడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వికలాంగులకు, నడవలేని వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వ యంత్రాంగానికి ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికి ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయకుండా సచివాలయాలు వద్ద పంపిణీ చేస్తున్నారు. దీంతో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులు బంధువులు సహాయంతో పింఛన్లు కోసం సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం స్పందించి ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని వృద్ధులు, వికలాంగులు కోరుతున్నారు.

వేపాడ: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఊపందుకుంది. రెండు రోజులు ఆలస్యమైనప్పటికీ సిబ్బంది త్వరితగతిన ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందులో భాగంగా గురువారం నాటికి డిఆర్‌పేటలో 96శాతం, సోంపురం 95, వేపాడ 94, సింగరాయి 81, కుంపల్లి 84, బానాది, జాకెరులలో 85, వావిలిపాడులో 90శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు.

కొత్తవలస: మండలంలో పింఛన్లు కోసం గ్రామ సచివాలయాలు వద్ద వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు క్యూ కడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలలో ఉన్నందున వాలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వికలాంగులకు, నడవలేని వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వ యంత్రాంగానికి ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికి ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయకుండా సచివాలయాలు వద్ద పంపిణీ చేస్తున్నారు. దీంతో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులు బంధువులు సహాయంతో పింఛన్లు కోసం సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని వృద్ధులు, వికలాంగులు కోరుతున్నారు.

బొబ్బిలి: క్యూలో నిలబడిన పింఛనుదారులు

పింఛన్ల పంపిణీ తనిఖీ చేసిన ఎంపిడిఒ

తెర్లాం: మండలంలోని కునాయవలస సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఎంపిడిఒ మధుసూదన్‌రావు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులూ కలగకూడదన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మంచినీటి సదుపాయం, టెంట్లు, ప్రథమ చికిత్సకు సంబంధించిన మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రేగిడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ రాములమ్మ, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ఎండలు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కార్యాలయానికి వచ్చిన అర్జీదారులకు, ఉద్యోగులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఆర్ఐ రేవతి, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ రామకృష్ణ ఉన్నారు.

డెంకాడ: జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు ఆధ్వర్యంలో సాయికృష్ణ రైతుమిత్ర గ్రూప్, డెంకాడ సత్యరాజ్ ఎంటర్‌ప్రైజెస్, మోపాడ ఎరువుల దుకాణాల నిర్వాహకులు గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. విటి రామారావు మాట్లాడుతూ చలివేంద్రాన్ని రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ. నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి పి.నిర్మల, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టివి రమణ

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యం చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌ఒబి వద్ద ఉద్యోగుల తమ న్యాయమైన సమస్యలు పరిష్కారించాలని చేస్తున్న పోరాటం 64 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ యాజమాన్యం ప్రజా ప్రతినిధుల వద్ద కూడా అబద్ధాలు చెప్పి చర్చల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. ఉద్యోగులకు చేయవలసిన వేతన ఒప్పందంలో ఉద్యోగులకు మేలు చేసే విధంగా డ్రాఫ్ట్ తయారు చేయకుండా ఉద్యోగులను షరతుల పేరుతో ఇబ్బందులు గురి చేసే విధంగా తయారు చేసి ప్రజా ప్రతినిధులను కూడా మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం చిత్తశుద్ధితో ఆలోచించి ఉద్యోగులు అడుగుతున్న బకాయిలో ఉన్న డిఎ ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఆగిపోయిన వేతన ఒప్పందం చేయాలని, సస్పెండ్‌లు, వేధింపులు ఆపాలని, తొలగించిన ఉద్యోగులిద్దరిని విధుల్లోకి తీసుకోవాలని, చిన్నచిన్న కారణాలతో జరిమానాలు పెనాల్టీలు రికవరీ చేయడం ఆపాలని, సమ్మె కాలానికి జీతం చెల్లించాలని, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, జిల్లా కమిటీ సభ్యులు కె రామారావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం నారాయణ రావు, ఉద్యోగులు మధు, కామునాయుడు, రాంబాబు, బంగారు నాయుడు, నాగభూషణం, అప్పలనాయుడు, ఆదినారాయణ, గౌరీ, రామలక్ష్మి, మూర్తి, రామకృష్ణ, రామునాయుడు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించిన సమాచా రాన్ని మీడియాకు అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అందిన ఫిర్యాదులను కలెక్టర్ వివరించారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా, దానిపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నుంచి నేటివరకు వివిధ మార్గాల్లో 280 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 276 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. సి-విజిల్ ద్వారా 121, కాల్ సెంటర్‌కు 41, ఎన్‌జిఎస్‌పి పోర్టల్ ద్వారా 66, మీడియా ద్వారా 50, సోషల్ మీడియా ద్వారా 2 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు కోటి రూపాయల విలువైన నగదు, మద్యం, వివిధ రకాల వస్తువులను సీజ్‌చేసినట్లు చెప్పారు. దీనిలో రూ.11.20 లక్షల నగదు, రూ.35.03 లక్షల విలువైన మద్యం, రూ.20.83 విలువైన డ్రగ్స్, రూ.2లక్షల విలువైన ఆభరణాలు, రూ.30.02 లక్షల విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు 15 మంది వాలంటీర్లను తొలగించామని, ఇద్దరిపై కేసులు నమోదు చేశామని, ఇద్దరు రేషన్ డీలర్లపైనా కేసులు పెట్టామని, ఇద్దరు రేషన్ డీలర్లను తొలగించామని, రాజకీయ పార్టీలపై ఇప్పటివరకు 11కేసులు నమోదు చేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, సిపిఒ పి.బాలాజీ, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్, సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన కలెక్టర్

ఎన్నికల కంట్రోల్ రూమును జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సందర్శించారు. వివిధ విభాగాల వద్దకు వెళ్లి, ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అధికారులతో చర్చించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఇతర అధికారులు ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు

రేగిడి: మండలంలోని కొండవలస, కాగితాపల్లి సమస్యాత్మక గ్రామాలలో కేంద్ర బలగాలతో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ పోలీస్ కవాతులో స్థానిక ఎస్ఐ ఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డిఎస్‌పి మహేంద్ర, రాజాం సిఐ శ్రీనివాసరావు హాజరయ్యారు. 70 మంది సిఆర్‌పిఎఫ్, ఆర్‌పిఎఫ్‌ఎస్ కేంద్ర బలగాలతో పలు వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ఆ గ్రామాల్లో కేంద్ర బలగాల పోలీసులతో పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వంగర: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో అరసాడ, సంగాం, ఎం. సీతారాంపురం, శివ్వాం గ్రామాలలో ట్రైనీ డిఎస్‌పి మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా మెలగాలని ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ ఎస్ శ్రీనివాస్, వంగర ఎస్ఐ. వైవి జనార్ధన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో సంక్షోభం

ప్రజాశక్తి - జామి

రాష్ట్రంలో సంక్షేమం పేరుతో జరుగుతున్న సంక్షోభాన్ని గుర్తించి, రాష్ట్రం కోసం ఈ సార్వత్రిక ఎన్నికలకు టిడిపి, జనసేన, బిజెపి కూటమికి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా పార్టీ తరపున సంపూర్ణ మద్దతు తెలిపారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. గురువారం జామిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉచిత పథకాల పేరుతో రాష్ట్రాన్ని దివాల తీయించారని, యువతకు ఉపాధి అవకాశాలు లేవని, రైతులు సంక్షోభంలో కూరుకు పోయారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం తీసుకువచ్చి మరో సరికొత్త దోపిడీకి తెర తీశారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్తు బిల్లులో ట్రూ అప్ ఛార్జీల మోత మోగించారని, ఇప్పుడు కొత్తగా ఓవర్ లోడ్ పేరుతో ప్రతి ఇంటికీ విద్యుత్తు శాఖ అధికారులు నోటీసులు పంపుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సుస్థిరమైన అభివృద్ధి కాంక్షించే అనుభవం కలిగిన పార్టీలు, నాయకులు అవసరం ఉందని గుర్తించి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మద్దతు నివ్వడాన్ని రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు అభినందించారని భీశెట్టి చెప్పారు